క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు శ్రీకాంత్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శ్రీకాంత్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి మొక్కుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులా భారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నా రు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశా ల నుంచి ఈ ఏడాది స్కూల్ గేమ్స్‌లో ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న 18 మంది క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పాల్గొని క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు విద్యార్థులు


కారు భాగాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

పెందుర్తి: వృత్తి విద్య శిక్షణ, ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పెందుర్తి మారుతీ షోరూమ్‌ను సందర్శించారు. కార్ల మరమ్మతులు చేసే విధానాన్ని, కారు భాగాలను తెలుసుకున్నారు. మెకానికల్ ఇంజినీర్లు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఎంఈవో సువర్ణ, హెచ్ఎం సీహెచ్ చిన్మయి, ఒకేషనల్ టీచర్ మహేష్, సోషల్ టీచర్ ఎస్.రామా రావు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో శనివారం అడవివరంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో 98వ వార్డు బీజేపీ నాయకుడు వేమూరు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. సుమారు 200 మందికి కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, సాధారణ పరీక్షలను అక్షయ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్య బృందం చేసింది. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్.పరశురాం రాజు, 98వ వార్డు బీజేపీ అధ్యక్షుడు రచ్చ ఆనంద శ్రీనివాసవర్మ, ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్ పాల్గొన్నారు.


మామిడి చెట్లపై కురుస్తున్న మంచు

వాతావరణ మార్పులు.. మామిడి పంటపై పగబట్టాయి. డిసెంబర్‌లో మొదలైన చలి, సంక్రాంతికి చుట్టుముట్టిన పొగ మంచు.. మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇప్పటికే పూత ఆలస్యం కావడంతో పాటు, వచ్చిన పిందెలు కూడా రాలిపోతున్నాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ మామిడి, జీడిమామిడి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ సమయంలో 'పూత, పిందె'ను కాపాడుకోకుంటే..తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. - పరవాడ

మామిడికి మంచుదెబ్బ

- దట్టంగా పొగమంచు
- మామిడి, జీడిమామిడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతులు


జీడి మామిడి చెట్లపై కురుస్తున్న మంచు

ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడి, జీడి తోటలు ఆశించిన రీతిలో పూత, పిందెలు రావడం లేదు. మూడు రోజులుగా అధికంగా కురుస్తున్న మంచు జీడి, మామిడి తోటలకు తీవ్ర నష్టం కలుగజేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 184 ఎకరాల్లో మామిడి, 1,200 ఎకరాల్లో జీడి మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. మండల పరిధిలో నాయుడుపాలెం, ముత్యాలమ్మ పాలెం, తిక్కవానిపాలెం, వాడచీపురుపల్లి, రావాడ, వెన్నలపాలెం, కలపాక, పెదముషిడివాడ, తానాం, భర్నికం, పరవాడ ప్రాంతాల రైతులు మామిడి, జీడి తోటలను సాగు చేస్తున్నారు. జీడి తోటలకు డిసెంబరు, జనవరి మాసాల్లో పూత, పిందె వచ్చి ఏప్రిల్ నెలలో ఫలసాయం చేతికి వస్తుంది. అయితే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు చల్లగా ఉండడం వలన జీడిమామిడి చెట్లకు కొత్త చిగుర్లు రావడం ఆలస్యమవుతున్న కారణంగా పూత, పిందెలు కనిపించని పరిస్థితులున్నాయి. ఫలితంగా జీడి, మామిడి తోటలపై గంపెడాశలు పెట్టుకున్న రైతాంగం ఆందోళన చెందుతోంది.

ఎన్నడూ లేని విధంగా దట్టంగా పొగ మంచు

మూడు రోజులుగా కురుస్తున్న మంచు ప్రభావంతో అక్కడక్కడ పూత కొచ్చిన తోటలకు తీవ్ర నష్టం జరిగే అవకాశాలు ఉండడంతో రైతులు మరింత ఆవేదన చెందుతున్నారు. ఇసుక నేలల్లో వేసిన జీడి తోటలకు వచ్చిన పూతలు నిలబడడానికి వీలుగా మందులు పిచకారి చేస్తున్నారు. ఇటీవల కురుస్తు న్న మంచు ప్రభావంతో జీడిమామిడి తోటలకు పూసిన పూత మాడిపోయి రాలిపోతోందని, దీని వలన పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి మందులు పిచకారి చేస్తున్నప్పటికీ మూడు రోజులుగా కురుస్తున్న పొగమంచు వలన పంటలకు తీవ్ర నష్టం సంభవించే ప్రమాదం ఉందని చెబుతున్నారు. మంచు వలన జీడి మామిడి తోటలకు రసం పీల్చే పురుగులు, కుళ్ల తెగుళ్ల ఆశించి తీవ్ర నష్టం కలుగజేసే అవకాశాలు ఉన్నా యి. జీడిమామిడి తోటలకు పూత రానిపక్షంలో 13-0-45 రసాయన ఎరువు 10 గ్రాములు, 3 గ్రాముల సల్ఫర్, 1.6 మిల్లీమీటర్లు మోనోక్రోటో ఫాస్ మందును లీటరు నీటిలో పిచకారి చేయడం ద్వారా పూత నిలబడడానికి అవకాశాలు ఉన్నా యని ఉద్యానవన శాఖ అదికారులు చెబుతున్నారు. పూతరాని తోటలో పొగ పెట్టడడం ద్వారా పూత వచ్చే అవకాశాలు ఉంటాయి. ఎరువు లు వేసి నీటి తడులు అందించడం ఎంతైనా అవసరం.

పూత రాలిపోతోంది



అర ఎకరా విస్తీర్ణంలో మామిడి తోటను సాగుచేస్తున్నా. కొన్ని రోజులుగా కురుస్తున్న మంచు కారణంగా పూత రాలిపోతోంది. మామిడి తోటలకు తెగుళ్ల వ్యాప్తి చెందకుండా మందులు పిచకారి చేస్తున్నాం. పూత మాడిపోకుండా సస్యరక్షణ చర్యలపై సలహాలు అందించాలి.

– పైల సన్యాసినాయుడు, రైతు, పరవాడ

మందులు సరఫరా చేయాలి



మంచు ప్రభావంతో జీడిమామిడి, మామిడి పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మందులు సరఫరా చేయాలి. మంచు కారణంగా జీడి, మామిడి తోటలకు పూత రావడం లేదు. పూత వచ్చిన మంచు కారణంగా మాడిపోయి రాలిపోతోంది. జీడి, మామిడి తోటలకు పూర్తి స్థాయిలో పూత రాలేదు. అక్కడక్కడ వచ్చినా మంచు వలన మాడిపోతోంది.

– రాంబాబు, రైతు, నాయుడుపాలెం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



జీడిమామిడి తోటలకు టీ దోమ, తామర పురుగు, మొదలు కుళ్లు తెగుళ్ల ఆశిస్తాయి. టీ దోమ నివారణకు లాంబ్డాసై హాలోత్రిన్ 2 ఎంఎల్ మందును లీటరు నీట్లో కలిపి పిచకారి చేయాలి. గెల మాగుడు తెగులు నివారణకు మేంకోజిబ్ గ్రాము మందును లీటరు నీటిలో పిచకారి చేసుకోవాలి. కాండం తొలుచు పురుగు నివారణకు నువాన్ మందును దూదిలో ముంచి చెట్టు మొదలు తవ్వి దూది ముంచిన మందును చెట్టు మొదలను పెట్టి పేడతో పూడ్చాలి.

– ఎ.లావణ్య, ఉద్యానవన శాఖ అధికారి, పరవాడ

'పీఎం సూర్యఘర్'తో విద్యుత్ ఆదా

ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామకృష్ణ


మాట్లాడుతున్న ఏఈ రామకృష్ణ

పరవాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకం కోసం దరఖాస్తులు చేసుకొన్న వినియోగదారులకు రాయితీతో సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మిస్తామన్నారు. వివిధ బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తాయని చెప్పారు. ఇంటి పై కప్పుపై 10 చదరపు మీటర్ల స్థలాన్ని సమకూర్చడం ద్వారా ఒక కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారుడికి రూ.1000 బిల్లు వస్తే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు తరువాత రూ.338 బిల్లు వస్తుందని తద్వారా ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. పథకం పై గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. సదస్సులో ఏడీ బి.కనకారావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఏఈ శేషసాయి, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి బిల్ కలెక్టర్ మృతి


మృతి చెందిన సత్యనారాయణ(ఫైల్)

పెందుర్తి: తమ ఫ్లాట్‌లోని బాల్కనీలో విద్యుత్ బల్బ్ మారుస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్పన్నపాలెం సమీపంలోని బాలాజీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలివి.. జీవీఎంసీ 94వ వార్డు వెంకటాపురం ప్రాంతంలో బిల్ కలెక్టర్‌గా (జీవీఎంసీ ఔట్‌సోర్సింగ్) పనిచేస్తున్న దాడి వెంకట సత్యనారాయణ (47) బాలాజీ హైట్స్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం విధులకు వెళ్లిన సత్యనారాయణ మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వచ్చాడు. భోజనం అనంతరం బాల్కనీలో పోయిన బల్బ్ మార్చేందుకు గోడ ఎక్కాడు. గోడ మీద నుంచి కాలు జారడంతో మొదటి ఫ్లోర్ నుంచి కింద పడిపోయాడు. తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో సత్యనారాయణను గోపాలపట్నంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పద్ధతులతో బోధన అవసరం

సబ్బవరం: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు అంతా పాల్గొన్నారు. పాఠశాలలో చదివే 1, 2వ తరగతుల చిన్నారులకు నూతన పద్ధతుల ద్వారా బోధనపై అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చిన 15 మంది రిసోర్స్ పర్సన్లకు సబ్బవ రం మండల ఉపాధ్యాయులంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లెక్కల హేమంత్ సుదేవ్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఆరు వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని వాటికి స్మార్ట్ టీవీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నామాల శ్యామల, మాధురి, అనిత, పీవీ చాముండేశ్వరి, అశోక్ కుమార్, వి.నాగరత్నమ్మ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి

పెందుర్తి: చింతల అగ్రహారం, జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు లీలా గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవయవదానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయువదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినోద్ బాబు,గ్రామ పెద్దలు, అఖిల భారత శరీర మరియు అవయవ దాతల సంఘం సభ్యులు కె.వెంకట్ కృష్ణ ,వై.నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకులు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సమయంలో పిల్లలకు సాంఘిక శాస్త్రంలో పాఠాలు చెబుతుంటే కలిగే ఆనందం ఈ రోజు అవయవ దానంపై అవగాహనపై కల్పిస్తుంటే కలిగిందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం నేత లీలా గంగాధర్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు చెక్


శిక్షణ పొందిన విద్యార్థులతో మళ్ల అనూష

పెందుర్తి: సాంకేతిక పరిజ్ఞానం ఉండడం వలన సైబర్ నేరాలకు చాలా వరకు చెక్ పెట్టవచ్చని ఐసీటీ స్టేట్ హెడ్ డాక్టర్ దినకర్‌రెడ్డి అన్నారు. పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ ట్రెనింగ్ కార్యక్రమంలో శనివారం ముగిసింది. ఈ సందర్భంగా దినకర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డింగ్టన్ కంపెనీ, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా విస్తం కళాశాలలో 140 గంటల సైబర్ సెక్యూరిటీ ట్రెనింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామన్నారు. వెల్ఫేర్ సంస్థల ప్రెసిడెంట్ మళ్ల అనూష మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.వి శివ కుమార్ మాట్లాడుతూ విస్తం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 60 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారని చెప్పారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులకు శిక్షణ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ట్రెనర్ ఉపేంద్ర, ఆర్.ఎం సురేష్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రశాంత్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: పురుషోత్తపురం సమీపంలోని కంఫర్ట్ హోమ్స్‌లో శ్రీనివాస, పద్మావతి కల్యాణం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వెంకటాద్రి ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేయించారు. పల్లకి సేవ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలతో మంగళ వాయిద్యాలు నడుమ వేదమంత్రోక్తంగా కల్యాణం జరిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు,పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, కంఫర్ట్ హోమ్స్ అధ్యక్ష కార్యదర్శులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, విజయ గణపతి ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.సింహాచలం, టి.మాధవ్, కోశాధికారి ఎ.కేశవరావు, అపార్ట్‌మెంట్ వాసులు కల్యాణంలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం


కార్యక్రమంలో పాల్గొన్న శేష శైలజ, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో వెంకట్రావు


పెందుర్తి కళాశాల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు


సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు


సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు


పెందుర్తి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని పెందుర్తి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి.శేష శైలజ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పెందుర్తిలో శనివారం నాలుగు రోడ్ల కూడలి నుంచి జూనియర్ కళాశాల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఓటు వేయడం దేశ పౌరుడిగా ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు తమకు నచ్చకపోతే 'నోటా' ద్వారా వారిని తిరస్కరించే అవకాశం కూడా ఉందన్నారు. ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధిక సార్లు ఓటు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. కొత్త ఓట్లకు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో కొల్లి వెంకట్రావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వి.అర్జున రావు, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సత్కారం

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీనియర్ ఓటర్లు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి కోరారు. సబ్బవరంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక మూడు రోడ్లు కూడలి వరకూ పలు కళాశాలల, పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేస్తూ మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నోటుకు ఓటును అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలు,పాఠశాల్లో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజతో పాటు ఏవో శివ రాంప్రసాద్, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, ఆర్ఐ వీరయ్య, ఎన్.రామకృష్ణ, పలు శాఖల అధికారులు, కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ్ అభియాన్


అంబేడ్కర్, భారతమాత చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పీవీఎన్ మాధవ్ తదితరులు

పెందుర్తి: బీజేపీ ఆధ్వర్యంలో 97వ వార్డు ఏకలవ్యకాలనీలో శనివారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలనీ వాసులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిక్కాల సతీష్, శ్రీకాంత్, గురునాథ్, ప్రసాద్, వెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అడవివరం గ్రంథాలయంలో..

సింహాచలం : అడవివరం గ్రంథాలయంలో శనివారం సంవిధాన్-గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఈకార్యక్రమంలో పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. భారత రాజ్యాంగం విశిష్టతను, అంబేడ్కర్ గొప్పదనాన్ని పాఠకులకు వివరించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, బీజేపీ 98వ వార్డు అధ్యక్షుడు రచ్చ ఆనంద శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: రాజ్యాంగాన్ని గౌరవించి అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న బీజేపీని ప్రజలందరూ బలపరచాలని సంవిధాన్ గౌరవ్ అభియాన్ జిల్లా కమిటీ సభ్యులు గోటివాడ సామ్రాట్ కుమార్ పిలుపునిచ్చారు. సబ్బవరంలోని గెడ్డం వీధిలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే నేడు ప్రజాస్వామ్య ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్డి రామునాయుడు, అధికార ప్రతినిధి గొర్లి ప్రసాద్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు భూపతి అప్పారావు, సబ్బవరం మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆకాష్ కుమార్, గెడ్డం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజనవల్లభస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహిళలచే సామూహిక కుంకుమార్చనను విశేషంగా నిర్వహించారు. గోపీజన వల్లభ స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.మురళీకృష్ణ చేసిన భాగవతం ప్రవచనం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యుడు చాగంటి కోటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఐదు కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: పెందుర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లాకు చెందిన గంధం నాగరాజు శనివారం రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

PUBLIC NOTICE

It is for general information that I. **SHAIK ROSHAN ALI** S/o.SHAIK PEER SHAHEB, Resident of 1-22/3, PULAGALIPALEM, PENDURTHI, VISAKHAPATNAM, ANDHRA PRADESH -531173, declare that name of mine and my mother and father have been wrongly written as **SK ROSHAN ALI , SK NISHA AND SK PEER SHAHEB** in my BIRTH certificate ,10th class,12th class, B.Tech. M.Tech documents. The actual name of mine and my mother and father are **SHAIK ROSHAN ALI, SHAIK NISHA AND SHAIK PEER SHAHEB.**